వృక్షాలతో పర్యావరణ పరిరక్షణ

- ఏపీఐఐసీ జెడ్‌ఎం వెంకటేశ్వర్లు
- ఆటోనగర్‌లో మొక్కల పెంపకం



ఆటోనగర్ డీ-బ్లాక్‌లో మొక్క నాటుతున్న ఏపీఐఐసీ జెడ్‌ఎం వెంకటేశ్వర్లు, చైర్మన్ రఘు

అక్కిరెడ్డిపాలెం: పర్యావరణ పరిరక్షణకు వృక్షాలే ప్రధానమని ఏపీఐఐసీ జెడ్‌ఎం ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ డీ-బ్లాక్‌లోని మ్యాంగో పార్క్‌లో ఆటోనగర్ ఐలా, వాసీవా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్‌ఎం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు పారిశ్రామికవేత్తలు కృషి చేయాలన్నారు. పరిశ్రమల పరిధిలో వీలైనంత మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతం పచ్చదనంతో నిండిపోవాలని ఆకాంక్షించారు. చెత్తా, చెదారం నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్య కారకాలను వీలైనంత వరకు తగ్గించేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఐలా చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి(రఘు) మాట్లాడుతూ ఆటోనగర్ ఐలా పరిధిలో ఎక్కువగా మొక్కలు నాటి సంరక్షించుకుంటే పర్యావరణ పరిరక్షకు సహకరించిన వారమవుతామన్నారు. విద్యుత్ తీగలకు అవాంతరంగా మారుతున్నాయని సిబ్బంది పూర్తిగా చెట్లను తొలగించడం బాధాకరమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈకు విన్నవించారు. మొక్కలు నాటేటప్పుడు విద్యుత్ తీగలను దృష్టిలో పెట్టుకుని మొక్కలు నాటాలని పారిశ్రామికవేత్తలను కోరారు. అనంతరం మ్యాంగో పార్క్ నుంచి మొక్కలను నాటండి - పర్యావరణాన్ని పరిరక్షించండంటూ ర్యాలీ నిర్వహించారు. ఆటోనగర్ డీ-బ్లాక్ మెంబర్, ఐలా కోశాధికారి పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐలా కమిషనర్ జయచంద్ర, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, పెదగంట్యాడ ఐలా చైర్మన్ సత్యనారాయణ, ఐలా మాజీ చైర్మన్లు వై.సాంబ శివరావు, శేషగిరిరావు, రాంప్రసాద్, అట్లూరి రమేష్, విశాలక్షి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పెదగంట్యాడ: 11 కేవీ పాలవలస ఫీడర్ పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 14న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్ - 2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ పాలవలస ఫీడర్ పరిధిలోని మద్దివానిపాలెం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, దేవాడ, అప్పికొండ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, మురుభాయ్, పాలవలస, గొల్లపేట, ఈసరపువానిపాలెం, యలమంచిలి దొడ్డి, గిన్నివానిపాలెం, నక్కదొడ్డి ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేద విద్యార్థిని చదువుకు చేయూత



విద్యార్థినికి పుస్తకాలు అందిస్తున్న రామ అప్పారావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక నిర్వాసిత కాలనీకి చెందిన నిరుపేద విద్యార్థిని జి.రాణికి సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు రూ.5 వేల విలువైన అచ్చు పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించారు. విశాఖ విమల విద్యాలయంలో చదువుతున్న రాణి తల్లి కష్టపడితే తప్ప ఇల్లు గడవడం కష్టంగా ఉండడంతో రామ అప్పారావు సాయం చేశారు. ఈ సందర్భంగా సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే గజేంద్రరావు మాట్లాడుతూ పేదల కష్టాలపై చలించే రామ అప్పారావు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, చిత్తా నాగమణి పాల్గొన్నారు.

ఖాళీ క్వార్టర్లను రిటైర్డ్ ఉద్యోగులకు కేటాయించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఖాళీగా ఉన్న క్వార్టర్లను రిటైర్డ్, మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకు కేటాయించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం స్టీల్ సీఎండీకు లేఖ అందజేశారు. చాలా క్వార్టర్లు ఖాళీగా ఉండడం వల్ల పాడై పోతున్నాయన్నారు. వాటి నిర్వహణ టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి భారంగా మారుతుందన్నారు. వాటిని రిటైర్డ్ ఉద్యోగులకు కేటాయించడం ద్వారా వాటిపై కొంత ఆదాయం కూడా వస్తుందన్నారు. దీనిపై తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు.

నేడు రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంపై ప్రచారం చేస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం(సీ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద బ్యానర్లు ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2012 జూన్ 13న ఉక్కు చరిత్రలో ఘోర దుర్ఘటన చోటు చేసుకుందన్నారు. అందులో 19 మంది అధికారులు, కార్మికులు అసువులు బాశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జూన్ 14న స్మృతి దివస్ పేరిట రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది కూడా సీ భవన్‌లో లయన్స్ క్లబ్, జేసీఐ సహకారంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగే రక్తదాన శిబిరంలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీ నాయకులు కాటం చంద్రరావు, కె.వి.డి.ప్రసాద్, నరసింహ, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలి



కేంద్రంలో పుస్తకాలు పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

ఆరిలోవ: చినగదిలి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్ట్‌లు, నోట్ పుస్తకాలు ఉన్న కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఎంఈవోలను ఆదేశించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాల కేంద్రాన్ని ఆయన విద్యా విభాగం అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. చినగదిలి మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఆయా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు వచ్చాయా? లేదా? తదితర వివరాల గురించి ఎంఈవోల ద్వారా తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఇక్కడ కేంద్రంలో ఉన్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూలు కిట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పుస్తకాల కిట్లను జాగ్రత్తగా మండలంలో అన్ని పాఠశాలలకు పంపిణీ జరిగేటట్లు ఎంఈవోలు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. మండలంలో 72 పాఠశాలల్లో 13,148 మంది విద్యార్థులున్నారన్నారు. వారిలో ప్రస్తుతం 83 శాతం మందికి పాఠ్య పుస్తకాలు రాగా, 100 శాతం మందికి సరిపడా నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. షూలు 80 శాతం, బెల్టులు 55 శాతం మందికి సరిపడా వచ్చినట్లు తెలిపారు. ఇంకా యూనిఫారం రాలేదని, కొద్ది రోజుల్లో రానుందని, వచ్చిన వెంటనే సరఫరా చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ్య పుస్తకాల కిట్లు పంపిణీ రాష్ట్ర కోఆర్డినేటర్ కల్పన, ఎంఈవో-1 రవీంద్రబాబు, ఎంఈవో-2 అనురాధ, భవిత కోఆర్డినేటర్ గీత, పీఎంవో అప్పలనాయుడు, పీఆర్పీలు అప్పలరాజు, రాంబాబు, మండల కో-ఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న కల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.

విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ

సీతంపేట : సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా 'విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ 'అనే అంశంపై సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ శ్రీశ్రీ అలుపు లేని అన్వేషి అని, వెనుదిరగని సాహసి అన్నారు. జనం జీవనాడి తెలుసుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రయోగశాలిగా, పదునైన విమర్శకుడిగా శ్రీశ్రీ వినుతికెక్కాడని అన్నారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన ముందుగా ఇటీవల దివంగతులైన సహృదయ సాహితీ సభ్యుడు టీపీఎన్ ఆచార్యులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.వి.ఎ స్.మూర్తి, డి.వి.సూర్యారావు, ఎస్.విజయకుమార్, సి.హెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమే



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, తదితరులు

సీతంపేట : ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్, స్వంతన సేవా సమితి సంయుక్తంగా ముద్రించిన «బాలల హక్కులు.. చట్టాలు»పుస్తకావిష్కరణ సభ బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో జరిగింది. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమే అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను సమస్యగా కాకుండా సవాలుగా చూడాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని నిజాయితీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులకు అవగాహన లోపం వల్ల విద్యార్థులు బాలకార్మికులుగా మారుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ సెంటర్ కార్యదర్శి డాక్టర్ సత్యమూర్తి, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపేస్తున్నట్టు ప్రకటించాలి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేస్తున్నట్టు కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి ప్రకటించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. బుధవారం ఉక్కునగరం సీటు కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీపీసీఎల్ ప్రైవేటీకరణ నిలిపివేస్తున్నట్టు కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్దీప్ పూరి ప్రకటించడం హర్షణీయమన్నారు. అక్కడి కార్మికుల సుదీర్ఘ పోరాట ఫలితంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అదే విధంగా మూడేళ్లుగా విశాఖ స్టీల్ కార్మిక వర్గం పోరాటం చేస్తుందన్నారు. వెంటనే ప్రైవేటీకరణ నిలిపివేయడంతో పాటు పూర్తి స్థాయి ఉత్పత్తి చేసేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, యు.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి ఆధారంగానే సంతానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాధిక

తగరపువలస : ఆయా వ్యక్తుల జీవనశైలిపై ఆధారపడి మెరుగైన సంతానం లభిస్తుందని ఓయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ వైద్యులు పొట్నూరు రాధిక, విజయలక్ష్మి సూచించారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 'హెల్దీ లైఫ్‌స్టైల్ ఫర్ వుమెన్ అండ్ మెన్' అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సంతానం కోసం నిపుణులను ఎప్పుడు సంప్రదించాలి, అందుబాటులో ఉన్న అధునాతన చికిత్సలను వివరించారు. అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేయగా.. అమ్మవారిని పసుపు కుంకుమలు, పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిబిరం ప్రారంభం

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో బుధవారం ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరాన్ని ఆలయ చీఫ్ సెక్రటరీ ఆర్.ఎ.పాత్రో ప్రారంభించారు. యోగాచార్యుడు బుడ్డిగ సత్యనారాయణ అభ్యాసకులకు శిక్షణ ఇచ్చారు. యోగాసనాలతో పాటు ధ్యానం, ముద్రలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు మాట్లాడుతూ ఈ శిబిరం ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ శిబిరంలో చినగదిలి, సాలిపేట, సంతపేట, ఆరిలోవ కాలనీ తదితర ప్రాంతాల నుంచి అభ్యాసకులు పాల్గొన్నారు.

శరవేగంగా ఆయుష్మాన్ ఆస్పత్రి పనులు



విమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆస్పత్రి భవనం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో చేపట్టిన ఆయుష్మాన్ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి కోసం విమ్స్ ఆవరణలో ఒకటిన్నర ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ 50 పడకలతో ఈ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నారు. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో పనులు ప్రారంభించారు. ప్రశాంతమైన వాతావరణంలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. విమ్స్‌లో ఇప్పటికే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఆయుష్మాన్ ఆస్పత్రి కూడా అందుబాటులోకి వస్తే మరింత ఎక్కువ మందికి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని నగరవాసులు ఆశిస్తున్నారు. వైద్యాధికారులు స్పందించి త్వరగా పనులు చేపట్టి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అనాథ బాలలకు ఎంబీఏ విద్యార్థుల చేయూత



అనాథ బాలలకు సమకూర్చిన వస్తువులతో ఎంబీఏ విద్యార్థులు, తదితరులు

అగనంపూడి: దువ్వాడలోని విజ్ఞాన్ ఎంబీఏ కళాశాలకు చెందిన విద్యార్థులు సామాజిక సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. విద్యార్థులు విశాఖ పరిధిలోని 7 అనాథాశ్రమాలకు చెందిన 195 మంది బాలలను కళాశాలకు బుధవారం తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త తరుణ్‌కుమార్ మాట్లాడుతూ అనాథాశ్రమాల్లోని ఇబ్బందులను గుర్తించి వారికి సహకారం అందించేందుకు ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. వైద్య సేవలు అందించిన వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆశ్రమాల్లోని బాలలు ఆరోగ్యం, దంతాలను పరిరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తర్వాత బాలలకు వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూధనరావు మాట్లాడుతూ అనాథ బాలల కోసం 'కర్తవ్య' పేరుతో ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఆశ్రమాలకు కావల్సిన నిత్యావసర వస్తువులతోపాటు ఫ్యాన్లు, దుస్తులు, స్కూల్ బ్యాగ్‌లు, కిరాణా సామగ్రి, స్టేషనరీ అందించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతులు సన్యాసిరావు, బి.చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల జీతాలు చెల్లించాలి



దీక్షా శిబిరంలో నాయకులు, కార్మికులు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు ఈ నెలలో అయినా సకాలంలో చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఎస్.రామారావు కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద దీక్షా శిబిరంలో బుధవారం ఆయన మాట్లాడారు. జీతాల చెల్లింపునకు యాజమాన్యం ఇచ్చిన మాటను ఈ సారైనా నిలబెట్టుకోవాలన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఉక్కు రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగొందిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్ని హీనస్థితికి తీసుకెళ్లిందని ఆరోపించారు. ఈ దుస్థితికి కారణమైన ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, ఆంధ్ర రాష్ట్రానికి అతిపెద్ద దిక్కుగా ఉన్న ఉక్కు కర్మాగారానికి ఊపిరి పోసేందుకు సంకీర్ణ ప్రభుత్వ పెద్దలు కృషి చేయాలని కోరారు. దీక్షా శిబిరంలో ఎస్ఎంఎస్ - 2 విభాగ కార్మికులు, నాయకులు డి.ఆదినారాయణ, రమణమూర్తి, నరేంద్ర, భాస్కరమూర్తి, మాణిక్యాలరావు, మరిడయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఉక్కు ఎస్‌బీఎంలో కాంట్రాక్ట్ కార్మికునికి గాయాలు



గోవింద వీపుపై గాయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్పెషల్ బార్ మిల్ (ఎస్‌బీఎం) విభాగంలో బుధవారం విధి నిర్వహణలో ఓ కాంట్రాక్ట్ కార్మికునికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... పెదగంట్యాడకు చెందిన గోవింద ఎస్‌బీఎంలో స్కిల్డ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం రోలింగ్ వైర్ కట్టకు స్టిక్కరింగ్ పనులు చేస్తున్నాడు. ఒక కట్టకు స్టిక్కరింగ్ చేస్తుండగా మరో కట్ట దగ్గరకు రావడంతో ఆ రెండింటి మధ్య నలిగిపోయాడు. ఈ పరిస్థితుల్లో అతని నడుము భాగానికి తీవ్రంగా గాయమైంది. వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం నగరంలోని ఆస్పత్రికి తరలించారు. అతని శరీరంపై 20 శాతం కాలినట్టు వైద్యులు తెలిపారు.

మరిడిమాంబ పండగకు వేళాయె





పండగకు ముస్తాబైన ఆలయం (ఇన్‌సెట్) మరిడిమాంబ అమ్మవారు

- నేడే ప్రధాన పండగ
- దేశ విదేశాల నుంచి తరలిరానున్న భక్తులు

సింధియా: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా సింధియా మరిడిమాంబ అమ్మవారికి ప్రతీతి. ఈ ఆలయానికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. నాటి నుంచి ఏటా అమ్మవారి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు సైతం ఈ ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. గురువారం అమ్మవారి ప్రధాన పండగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేశంలో మొట్టమొదటి నౌకా నిర్మాణ సంస్థ సింధియా నేవిగేషన్ కంపెనీగా పేరుగాంచిన నేటి హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థ ముఖద్వారం ఎదుట అమ్మవారు వెలసిందని పూర్వీకుల విశ్వాసం. 1965లో ఆలయ గోపురం, ముందు పెంకుతో మండపాన్ని నిర్మించారు. కాలనీ వ్యాపారులు గూడేల బాబూరావు, మిల్లు రంగబాబు వంటి వారే దేశ విదేశాల్లో స్థరపడిన వారి కుటుంబ సభ్యులు అమ్మవారి ఉత్సవాలను ఏటా అంగరంగ వైభవంగా జరిపిస్తుంటారు. షిప్‌యార్డ్‌ను నౌకాదళ రక్షణ రంగంలో విలీనం చేయడంతో ఉద్యోగులు, కాలనీవాసుల సంఖ్య తగ్గిపోవడంతో కొన్నేళ్లుగా అమ్మవారి ఉత్సవాలను కాలనీ పూర్వీకులే నిర్వహిస్తున్నారు. అలమానికి ఎటువంటి ఆదాయం లేకపోయినా భక్తులు, కాలనీ పెద్దల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి

సుదీర్ఘ చరిత్ర గల సింధియా మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు ఈ నెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అత్యంత ఘనంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 5న ఉత్సవ చాటింపుతో ప్రారంభమైన ఉత్సవాల్లో 6న పుట్ట బంగారం తీసుకువచ్చారు. ప్రతి రోజు అమ్మవారికి దూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 13న గురువారం పండగ ముగింపులో భాగంగా ఆలయంలో అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం జాతర మహోత్సవాన్ని భారీ బాణసంచా నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.



సర్వాంగ సుందరంగా ఆలయ ముఖ ద్వారం



ఆలయంలో ప్రతిష్ఠించిన మహాశివుని విగ్రహం

ఘన వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ

మహారాణిపేట : ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు కచ్చితంగా పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2016పై మాధవధారలో గల కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానా కట్టవలసి ఉంటుందన్నారు. తడి-చెత్త పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్ఆర్‌కే రావు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.శ్రీరామ చంద్రమూర్తి, పోర్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీవీఎన్‌టీ మూర్తి, జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, జిందాల్ కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.సతీష్, అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీలక్ష్మి, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.